

గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సతీశ్‌రెడ్డి

## నాగజ్యోతి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి

ములుగు రూరల్, నవంబర్ 16 : ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో పనిచేయాలని రాష్ట్ర రెడ్కో చైర్మన్, మండల ఎన్నికల ఇన్‌చార్జి ఏరువ సతీశ్‌రెడ్డి అన్నారు. అబ్బాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కోరండ్ల తిరుపతిరెడ్డి, వార్డు సభ్యుడు గువ్వ రాజు బీఆర్ఎస్‌లో చేరగా సతీశ్‌రెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని, రానున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని గ్రహించిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని అన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో నాగజ్యోతి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలంతా కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఎంపీటీసీలు దేవరనేని స్వామిరావు, గొర్రె సమ్మయ్య, బీఆర్ఎస్ గ్రామ సర్పంచ్ గండి కల్పనాకుమార్, నాయకులు వేములపల్లి భిక్షపతి, ఉయ్యాల భద్రయ్య, వేల్పూరి సత్యం, యూనస్, మోహన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- ఈసీ నిబంధనలు పాటించాలి
- పోటీలో 11 మంది అభ్యర్థులు
- వ్యయ వివరాలను నమోదు చేయాలి
- పోలింగ్ ఏజెంట్లను నియమించాలి
- ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

ములుగు టౌన్, నవంబర్ 16 : ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు అభ్యర్థులు తమవంతు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు సవిన్ బన్సల్, పోలీస్ పర్యవేక్షకుడు అంజన్ చక్రబొర్తి, వ్యయ పరిశీలకుడు వాగీష్ కుమార్ సింగ్, ఎస్పీ గౌష్ ఆలం, రిటర్నింగ్ అధికారి అంకిత్‌తో కలిసి పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ములుగు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నామినేషన్ల ఉపసంహరణ తర్వాత మొత్తం 11 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, ఒక బ్యాలెట్ యూనిట్ వినియోగిస్తామని తెలిపారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చును కట్టుదిట్టంగా రిజిస్టర్లలో నమోదు చేయాలని, వీటిని ఎన్నికల పరిశీలకులు తనిఖీ చేస్తారన్నారు. ఈ నెల 21 నుంచి 23 వరకు జిల్లాలో పరిశీలకులు పర్యటిస్తారని, అభ్యర్థుల ఖర్చులను సరిపోలుస్తారని చెప్పారు. కౌంటింగ్ ముగిసిన తర్వాత కూడా అభ్యర్థుల ఖర్చుల వివరాలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలో ఉన్న 303 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి అభ్యర్థులు ఏజెంట్లను త్వరితగతిన నియమించాలన్నారు. ఈ నెల 30న ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఆలోపు కేంద్రంలోకి వచ్చిన వారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఏజెంట్లు సెల్ ఫోన్లు తీసుకురావొద్దని, మైక్రో అబ్జర్వర్లు, ప్రిసైడింగ్ అధికారులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఏజెంట్లు ఉదయం ఐదు గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని, 6 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ కోసం టేబుల్‌కు ఒక్కరు చొప్పున డిసెంబర్ ఒకటి వరకు ఏజెంట్ల వివరాలందించాలని, వారికయ్యే ఖర్చును సైతం అభ్యర్థుల వ్యయంలో నమోదు చేస్తామని వివరించారు. విద్వేష ప్రసంగాలు, ప్రవర్తనా నియమావళి, డబ్బు, మద్యం పంపిణీ తదితర ఉల్లంఘనలపై సీ విజిల్ యాప్ లేదా 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుని వివరాలు గోప్యంగా ఉంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో ములుగు తహసీల్దార్ విజయభాస్కర్, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సిబ్బంది, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, పక్కన సవిన్ బన్సల్, అంజన్ చక్రబొర్తి, వాగీష్ కుమార్



ఏటూరునాగారం : కుమ్మరి వాడలో ప్రచారం చేస్తున్న లక్ష్మీ నర్సింహారావు



మంగపేట : ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ఇంటింటా ప్రచారంలో కాకులమర్రి
- నాగజ్యోతిని గెలిపించాలని వినతి

ఏటూరునాగారం, నవంబర్ 16 : బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, కాంగ్రెస్ చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు అన్నారు. మండల కేంద్రంలోని మూడో వార్డులోని కుమ్మరి వీధిలో గురువారం నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ ప్రాంత వాసులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకుపోయారు. వాటన్నింటినీ సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తానని, బడే నాగజ్యోతికి ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతాయని, ఇందులో ఎవరూ సందేహించాల్సిన అవసరం లేదన్నారు. ఈ సారి బడే నాగజ్యోతిని ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. గ్రామాల్లో కూడా తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను తిరిగి అధికారంలోకి రాగానే అమలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమాల్లో నాయకులు కూనూరు మహేశ్, తాడూరి రఘు, తుమ్మ మల్లారెడ్డి, కుమ్మరి చంద్రబాబు, సప్పిడి వెంకట్రాం నర్సయ్య, కాత యాదగిరి, సరికొప్పుల వెంకటేశ్వర్లు, కట్ల రమేశ్, వావిలాల ముత్తయ్య, సారయ్య, పర్వతాల ఎల్లయ్య, సంగం లక్ష్మి, బాసాని శేఖర్, సైలానీ బాబా, జాడి భోజారావు, ఈసం స్వరూప, మెరుగు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

### తాడ్వాయిలో..

తాడ్వాయి : మండల కేంద్రంతో పాటు లింగాల, కొడిశాల, బందాల, ఇందిరానగర్, బీరెల్లి, కామారం, మేడారం, రెడ్డిగూడెం తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు మ్యానిఫెస్టోను వివరించారు. కారు గుర్తుకు ఓటేసి అభ్యర్థి బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీల వారి మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా ప్రజలను గోస పెడుతున్నదని అన్నారు. ప్రజా సమస్యలు తెలిసిన, నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడే నాగజ్యోతికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో మేడారం సర్పంచ్ బాబురావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లయ్య, ఏటూరునాగారం ఆత్మ చైర్మన్ దుర్గం రమణయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఉపసర్పంచ్ ఇంద్రారెడ్డి, నాయకులు సాంబయ్య, వసంతరావు, బాపిరెడ్డి, గంగరాజు, రామయ్య, శ్రీనివాస్ తదితరులున్నారు.



తాడ్వాయి : మేడారంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

### మంగపేటలో..

మంగపేట : సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని పొదుమూరు, గంపోనిగూడెంతో పాటు పలు గ్రామాల్లో ఆయన గురువారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మ్యానిఫెస్టోలోని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ సిద్దంశెట్టి వైకుంఠం, గ్రామ శాఖ అధ్యక్షుడు నూనె లింగయ్య, సహకార సంఘం డైరెక్టర్ సింగరబోయిన నర్సయ్య, యూనస్, భుట్టో, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

## రామన్నగూడెంలో వైద్య శిబిరం

ఏటూరునాగారం, నవంబర్ 16 : మండలంలోని రామన్నగూడెంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ సుచరిత వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ధనలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ జైలు బాబు పాల్గొన్నారు.



బిడ్డను కుటుంబ సభ్యులకు అందజేస్తున్న శివలింగ ప్రసాద్

## అంబులెన్స్‌లో ప్రసవం

ఏటూరునాగారం, నవంబర్ 16 : గోవిందరావుపేట మండలం జవహర్ నగర్ టోల్ ప్లాజా వద్ద గురువారం 108 సిబ్బంది గర్భిణికి పురుడు పోసి తల్లి, బిడ్డ ప్రాణాలు కాపాడారు. వాజేడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కేసరి సారమ్మను 108లో ములుగుకు తరలిస్తుండగా పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లో ప్రసవించింది. తల్లీ బిడ్డను ములుగు వైద్యశాలకు తరలించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

గోవిందరావుపేట, నవంబర్16 : మద్యం తాగి వాహనం నడిపిన లారీ డ్రైవర్‌కు గురువారం ములుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి రామ్మోహన్‌రెడ్డి రూ.10వేల జరిమానా విధించారు. ఎస్సై షేక్ మస్తాన్ తెలిపిన వివరాల ప్రకారం.. పస్రా గ్రామ శివారులో ఈ నెల 9న డ్రైవర్ చుక్క సాయిరామ్ మద్యం తాగి లారీ నడుపుతూ పట్టుబడినట్లు తెలిపారు. కోర్టు నిందితుడికి జరిమానా విధించినట్లు తెలిపారు.